క్లుప్తంగా

సూరేపల్లిలో భక్తులకు మాలధారణ



సూరేపల్లి(భట్టిప్రోలు): మండల పరిధిలోని సూరేపల్లి గ్రామంలో కొలువైన శ్రీ కేదారేశ్వర వాయులింగ దేవస్థానంలో సోమవారం జొన్న రత్తయ్య గురుస్వామి ఆధ్వర్యంలో అయప్ప స్వామి భక్తులు మాలధారణ వేసుకున్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు 150 మంది అయప్పలు మాలధారణ వేసుకున్నారు. అయప్పలందరికీమాలలు, నూతన వస్త్రాలను దేవస్థానం ద్వారా నిర్వాహకులు అందచేశారు. అయప్ప స్వాములు ఎంతమంది మాలధారణ వేసుకున్నా దేవస్థానం తరపున వీటిని ఉచితంగా అందచేయడం జరుగుతుందని తెలిపారు. కార్తిక మాసంలో నెల రోజులు స్వాములకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

వేమూరు:మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళ వారం 10:30 నిమిషాలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రవి కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సాధారణ సర్వ సభ్య సమావేశానికి ఎంపీపీ యల్లమాటి మోహన్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

సత్తా చాటిన ఐలవరం విద్యార్థి



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న పిట్టు పవన్‌కుమార్ రెడ్డి నవంబర్ 27 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. హైస్కూల్‌లో పదవ తరగతి చదువుచున్న పవన్‌కుమార్ రెడ్డి, పి. విజయకుమార్ రెడ్డి, ఎ.సాయి సూర్య, ఈ నెల 11 నుంచి 12వ తేదీ వరకు బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన అంతర్ జిల్లా సిపక్ తక్రా పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విశేష ప్రతిభ కనబరచిన పవన్‌కుమార్ రెడ్డిని, ప్రతిభ చూపిన క్రీడాకారులు, శిక్షణ ఇచ్చిన శ్రీనివాసరెడ్డిలను హైస్కూల్ హెచ్‌ఎం మాచర్ల మోహన్‌రావు, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంఈవోలు పులి లాజర్ నీలం దేవరాజ్, ఫిజికల్ డైరెక్టర్ బాబులు అభినందించారు.

అన్నదాతలకు పెట్టుబడి సాయం ఏది?

తెనాలి: అన్నదాత సుఖీభవ పథకం క్రింద 20 వేల రూపాయలు పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, సోమవారం మహిళా రైతు శివకుమార్‌తో కలిసి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. నూతన కౌలుచట్టం చేయాలనీ కోరారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన చట్టం దుర్మార్గమైందని, తాము అధికారంలోకి వచ్చాక మేలైన చట్టం తీసుకు వస్తామని కూటమి నేతలు చెప్పి 18 నెలలు గడిచాయన్నారు. భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీకూడా ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఇంతకాలం గడచినా ఇంతవరకు అసెంబ్లీలో పెట్టక పోవటం అన్యాయమని శివసాంబిరెడ్డి అన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, పంట సహాయం, నష్టపరిహారం, ఈ క్రాప్, పంటల బీమా, పంట అమ్ముకోవడం వంటి సౌకర్యాలు పొందేందుకు వీలుగా నూతన కౌలు చట్టం తీసుకురావాలని కోరారు. కులాలతో సంబంధం లేకుండా పెట్టుబడి సాయం ఒకే విడతలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం



బాపట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



వేమూరు బస్టాండ్ సెంటరు నుంచి ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు



నగరంలో ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి
- ప్రభుత్వ తీరును ఎండగట్టిన వైఎస్సార్ సీపీ నాయకులు
- నిరసన ప్రదర్శనలు, వినతి పత్రాల అందజేత

బాపట్ల: కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి పేర్కొన్నారు. నకిలీ మద్యానికి నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వమే నకిలీ మద్యాన్ని ప్రోత్సహించటం చూస్తుంటే ప్రజల ప్రాణాలతో ఏవిధంగా చెలగాటం ఆడుతుందో ఇట్టే అర్ధమౌతుందన్నారు. ప్రభుత్వం 16 షాపులను బాపట్లలో నడుపుతుంటే నియోజకవర్గంలోని 59 బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మద్యం తాగి ప్రాణాలను కోల్పోయే వారి సంఖ్య ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. పిట్టలవానిపాలెం మండలం మహిళా అధ్యక్షురాలు బడుగు మాధవి మాట్లాడుతూ పేదల జీవితాలు నారావారి సారా వల్ల కూలిపోకుండా అరికట్టాలని సూచించారు. నాణ్యమైన మద్యం తక్కువ ధరకే అందిస్తామని నమ్మబలికి నకిలీ మద్యం తయారు చేయించి పేదల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండల రెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు,మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి, బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, చల్లా రామయ్య, జోగి రాజా, బీసీ సెల్ అధ్యక్షులు పీటవేణు, నామన చక్రపాణి, రాజా, గుదారంకయ్య, పట్టణ బీసీ నాయకులు వెంకట్రావు, మండల నాయకులు సుబ్బారావు, పట్టణ ప్రతినిధి ఇమ్మడిశెట్టి శ్రీను, పవన్, అడే చందు, లక్ష్మణ్, చంటి, కొండలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నగరంలో...

నగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కుటీర పరిశ్రమలుగా నకిలీ మద్యం తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చెప్పారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలని సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులైపారుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చితే కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని ప్రోత్సహించి అనారోగ్యప్రదేశ్‌గా మారిందన్నారు. నకిలీ మద్యం వల్ల ప్రజల ప్రాణాలు హరిస్తున్నాయని దుయ్యబట్టారు. కల్తీ మద్యంలో స్పిరిట్ కలపడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారన్నారు. నకిలీ మద్యం తయారీ కేంద్రాలను కూటమి ప్రభుత్వం పెంచి పోషించడంతో లక్షల కోట్లల్లో అవినీతి జరుగుతుందని విమర్శించారు. ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి నకిలీ మద్యం సేవించి ప్రాణాలు కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డాక్టర్ ఈవూరి గణేష్ డిమాండ్ చేశారు. గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి మద్యాన్ని ఏరులైపారిస్తున్నారన్నారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్‌టీ రామారావు మద్యపాన నిషేధం చేయాలనుకుంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యాన్ని ఆదాయవనరుగా మార్చుకుందన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న వారిపై ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. మద్యం దందాలపై సమగ్రవిచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సీఐ మార్దూరి శ్రీరామ్ ప్రసాద్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యార్లగడ్డ మదన్ మోహన్, సంయుక్త కార్యదర్శులు చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, మండల కన్వీనర్‌లు ఇంకోల్లు రామకృష్ణ, వైవీ రాంబాబు, కరేటి శేషగిరిరావు, ఎం.అనిల్ నాయకులు బాపనయ్య, ఎస్.కోటేశ్వరావు, డి.కొండలరెడ్డి, శ్రీనివాసరావు, కేవీ కృష్ణారెడ్డి, ప్రభుకిరణ్, రత్నాకర్, వీరేంద్ర, డాక్టర్ హతిక్, పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: నకిలీ మద్యం పై సీబీఐతో విచారణ జరిపించాలని పార్టీ అధికార ప్రతినిధి, నియోజక వర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం నియోజక వర్గ కేంద్రంలో నకిలీ మద్యంపై నిరసన వ్యక్తం చేశారు. బస్టాండ్ సెంటరులో దివంగతనేత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. వేమూరు బస్టాండ్ నుంచి ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వర్షంలో తడుస్తు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ కార్యాలయం వద్ద సీఐ రవి కుమార్‌కు వినత పత్రం అందజేశారు. బస్టాండ్ సెంటరులో మద్యం ఖాళీ సీసాలతో తోపుడు బండిపై వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం సరఫరా చేసి పేద ప్రజలు ప్రాణాలతో చెలగాటం అడుతున్నారని ఆయన మండిపడ్డారు. నకిలీ మద్యం తయారీని ఒక కుటీర పరిశ్రమలా మార్చి రాష్ట్రమంతా సరఫరా చేసిన వారిపై సీబీఐతో విచారణ జరిగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో బెల్టు షాపులు రెండు నుంచి ఐదు షాపుల వరకు నిర్వహించడం జరుగుతోందన్నారు. వెంటనే బెల్టు షాపులను తొలగించాలని ఆయన కోరారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ మద్యం షాపులు తీసుకొని వచ్చి నాణ్యతమైన మందు సరఫరా చేశారు.

కూటమి నాయకులు, నారాచంద్రబాబు నాయుడు కుట్ర చేసి ప్రభుత్వం మద్యం షాపులను తొలగించి, ప్రయివేటు మద్యం షాపులు ఏర్పాటు చేశారన్నారు. ప్రయివేటు మద్యం షాపుల ద్వారా కోట్లు సంపాదించు కోవడం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలు పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. నకిలీ మద్యం వల్ల కొన్ని కుటుంబాలు దెబ్బ తింటాయని, నకిలీ మద్యం ద్వారా ఎవరు కుటుంబాలు దెబ్బతినకూడదని ఈ ఉద్యమం చేయడం జరిగిందన్నారు.

కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం వెనుక ఉన్న సూత్రధారులను ఇంత వరకు అరెస్ట్ చేయలేదన్నారు. వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం ద్వారా అనేక కుటుంబాలను రోడ్డుపైకి తీసుకొని వచ్చిందన్నారు. ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. చర్యలు తీసుకోకపోతే బెల్టు షాపులపై కూడా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కోగంటి లవకుమార్, ఎంపీపీ యల్లమాటి మోహన్, గాజుల భాను ప్రకాశ్, దున్నా మేరీసుబాబు, బొల్లిముంత ఏడుకొండలు, గాదె శివ రామకృష్ణ రెడ్డి, దాట్ల మోహన్ రెడ్డి, బెల్లకొండ శివ పార్వతి, జల్లి జోషికాంత్, బొల్లెదు ప్రతాప్, పోతర్లంక సురేష్, చిలుమూరు రామోహనరావు, పడమటి శ్రీనివాసరావు, అనపురెడ్డి రాఘురామి రెడ్డి, సుగ్గల నాగమల్లేశ్వరరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నగరంలో సీఐకి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ గణేష్, పార్టీ నాయకులు



ఎక్సైజ్ సీఐ రవి కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అశోక్‌బాబు

ఆయుష్మాన్ భారత్ కార్డుల పేరుతో జనానికి టోకరా

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: ఆయుష్మాన్ భారత్ కార్డుల పేరుతో పట్టణ ప్రజల నుంచి సచివాలయంలో క్యాంప్‌లు నిర్వహిస్తున్న సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడటం తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి సి.హెచ్.మణిలాల్ అన్నారు. కార్డుల పంపిణీలో భాగంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు సోమవారం వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. స్పెషల్ క్యాంప్‌ల ద్వారా కార్డులను అందజేస్తూ ప్రజల నుంచి ఒక్కొక్క కార్డుకు అక్రమంగా రూ.100లు వసూలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ ఆర్థికంగా వెనుకబడిన పేదలకు రూ.5 లక్షల వరకు వైద్యం అందిస్తుందన్నారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద జారీ చేసే ఐడీ కార్డు వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే అనేక మందికి అందజేసిందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదైన వారికి నేరుగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా ఐడీ కార్డు ఉచితంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కానీ పట్టణంలోని 1, 2,3, 20, 13, 19 వార్డుల పరిధిలోని సచివాలయాల నుంచి వచ్చామని, ఈ రోజు మాత్రమే హెల్త్ ఇన్సూరెన్స్ ఆయుష్మాన్ భారత్ చేస్తామని, తరువాత హెల్త్ ఇన్సూరెన్స్ పొందలేరని ప్రచారం చేసి దరఖాస్తు చేసుకున్న ఒక్కొక్కరి నుంచి రూ.100లు వసూలు చేస్తున్నారన్నారు. అదే సిబ్బంది ఈ–శ్రమ కార్డులు సైతం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. వాస్తవానికి రెండు కార్డులు ఉచితమేనన్నారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో రూ.100, ఈశ్రమ పేరుతో రూ.50లు వసూలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఐడీ కార్డులకు డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.రమేష్, డి.కృష్ణ, ప్రసాద్, జి.డానియల్, ఎం.సూర్య, వై.నవీన్ తదితరులున్నారు.



మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న మణిలాల్

పీఆర్‌వన్ యాప్ పనితీరు పరిశీలన

కొల్లిపర: తాగు నీరు నాణ్యత, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి ఏర్పాటు చేసిన పీఆర్‌వన్ యాప్ పనితీరు, సమస్యలపై తాడేపల్లి పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం నుండి సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ సాయిలహరి, పీఎస్ టీం మెంబర్స్ నాగేంద్ర, రమికుమార్ లు ఎంపీడీవో వి.విజయలక్ష్మితో కలసి కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం గ్రామంలో మంచి నీటి పరిశుభ్రత నమోదు, మంచి నీటి వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. యాప్‌లో ఎటువంటి లోపాలు ఉన్నాయి అన్న అంశాలను ప్రయోగాత్మకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవ్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పెదపులివర్రు ఆలయంలో ప్రాతఃకాల పూజలు



ప్రాతః కాల పూజలు నిర్వహించిన దృశ్యం

పెదపులివర్రు(భట్టిప్రోలు): మండల పరిధిలోని పెదపులివర్రు వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన స్వయంభువు శ్రీ రాజరాజ నరేంద్రస్వామి వారికి సోమవారం సప్తమి ఆరుద్ర నక్షత్ర ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. స్వామి వారు పంచ దీప, సౌందర్య కాంతులతో దివ్య ఆనంద దర్శనం కావించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర కార్తిక మాసం ఈ నెల 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు నెల రోజులపాటు స్వామి వారికి ప్రతి నిత్యం బ్రాహ్మి ముహూర్తంలో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. అలాగే ఏకాదశి హారతిలో స్వామివారి దర్శనంలో భాగంగా ప్రతి నిత్యం ఉదయం 10:30 గంటలకు కార్తిక మాస శాంతి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. భక్తులు ఈ మహోత్సవంలో పాల్గొని గోత్ర నామ అభిషేకాలు, కల్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు భక్తులు పాత్రులు కాగలరని ఆలయ అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ తెలిపారు.

పరిష్కార వేదికతో సమస్యలు పరిష్కారం

రేపల్లె: ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందజేసి పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. తన సాగుభూమిని సర్వే చేసి హద్దులు చూపాలని భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామానికి చెందిన జొన్న శివలక్ష్మి దరఖాస్తు చేయగా, రేపల్లె పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధించాలని కోరుతూ ఓలేరుకు చెందిన ఓలేటి వీరరాఘవయ్య ఫిర్యాదు చేశారన్నారు.

అదేవిధంగా ఆముదాలపల్లిలోని తన 1.15 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేయాలని వేమూరు మండలం పెరవలి గ్రామానికి చెందిన వలివేటి ప్రభాకరరావు అర్జీ చేసుకున్నారన్నారు. ఇంటి నివేసన స్థలం సర్వే చేసి సర్టిఫికెట్ మంజూరు చేయాలని రేపల్లె మండలం బేతపూడికి గ్రామానికి చెందిన బుల్లయ్య, రాధా అనువారు వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఐదు సమస్యలను పరిశీలించి ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించబడునని చెప్పారు.



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

విలువలతో కూడిన విద్యను అందించండి

డాక్టర్ కృపాచారి

తెనాలిఅర్బన్: విలువతో కూడిన విద్యను అందించాలని దళిత ఓపెన్ యూనివర్శిటీ ఆఫ్ ఇండియా వైస్ ఛాన్సలర్ డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి పేర్కొన్నారు. నందులపేటలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మేరియన్ కేర్–ది ఎర్లీ ఎడ్యుకేషన్ అకాడమీని సోమవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విలువలు అంతరించిపోవటం బాధకరమన్నారు. వాటిని పెంపొందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మోర్లీ మాట్లాడుతూ మేరియన్ కేర్ అనేది మాంటిస్సోరి గ్రూఫ్ ఆఫ్ ఇనిస్ట్యూషన్స్‌లో భాగంగా తెలిపారు. డాక్టర్ మరియా, డాక్టర్ గ్లెస్‌డోమాన్ విద్యా సిద్ధాంతాలను సమన్వయం చేస్తు, చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఇది దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో విద్యాంసంస్థల కరస్పాండెంట్ సెబాస్టీన్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ స్లీవా, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అకాడమీని ప్రారంభిస్తున్న డాక్టర్ కృపాచారి

మురుగు పారుదలకు చర్యలు తీసుకోండి

తెనాలిఅర్బన్: మురుగు పోయే దారి లేక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పదోవ వార్డు ప్రజలు కోరారు. 10వ వార్డులో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. వార్డులో పర్యటిస్తు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని వీధులలో మురుగుపోయే దారి లేకపోవటంతో తాత్కాలిక కాల్వలను ఆమె ఏర్పాటు చేయించారు. త్వరలో కాల్వల నిర్మాణాలు చేపడతామని ప్రటించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, విశ్రాంత డీఈ సుబ్బారావు, పలువురు సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.







అల్పపీడనం కదా..

అల్పపీడన ప్రభావంతో పట్టణంలో సోమవారం కురిసిన వర్షంతో పట్టణమంతా కొంత మేర సేదతీరింది. గత కొన్ని రోజులుగా ఎంత ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు కొంత మేర సేదతీరారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు దాదాపు రెండుగంటలకుపైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమైన్నాయి. పట్టణంలోని సాయిబాబా ఆలయ రహదారి, నిజాంపట్నం రహదారి, కోర్టు ప్రాంగణాలలో నీరు నిలవటంతో ఆ ప్రాంతాలలో నీరు నిలిచి జలమయమైన్నాయి.

–రేపల్లె

బాణాసంచా లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి: దీపావళి పర్వదినం సందర్భంగా తెనాలి డివిజన్ పరిధిలో బాణాసంచాను విక్రయించడానికి ఆసక్తిగల వ్యక్తులు / వ్యాపారులు తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గుంటూరు లక్ష్మీకుమారి సూచించారు. అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం పట్టణంలోని నందులపేట, సుల్తానాబాద్‌లో గల బాణసంచా లైసెన్సుదార్ల దుకాణాలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, బాణాసంచా అమ్మకానికి సంబంధించి సురక్షిత చర్యలు, అగ్నిమాపక చర్యలతోపాటు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక లైసెన్సులు కేవలం దీపావళి పండుగకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని తెలిపారు. అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను మండలాల పరిధిలో ఆసక్తి గల వ్యక్తులు/వ్యాపారులు తమ పూర్తి వివరాలతో దరఖాస్తులను సంబందిత తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 15వ తేదీలోగా సమర్పించాలని కోరారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవటం జరగదని చెప్పారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేయనున్నట్లు వివరించారు.